# మందు

Chemists, Druggists Souvenir 1992

అపోహలు వద్దు. సందేహాల్ని డాక్టర్ని నేరుగా అడిగేస్తే ఆరోగ్యానికి మంచిది.

—జయప్రద

ఆ రోజు శుక్రవారం. నేనప్పుడే ఓ.పి.లో నా చెయిర్‌లో కూర్చొని పెన్ చేతిలోకి తీసుకుంటున్నాను.

"నేను మొన్నొచ్చినప్పుడు నువ్వు మందులు రాసిచ్చావా? ఆ మందులు తిన్నంతదాకా అట్టట్టా వుండిందా? ఇప్పుడు మళ్లా అదే తంతు"

నేను వ్రాసిన మందుల్ని విమర్శిస్తూ లోపలికొచ్చిందామె. ఆమె వయస్సు ముప్పై పైన మరో రెండేళ్ళుండొచ్చు.

మా స్వస్థలం రాజమండ్రి. మా శ్రీవారికి నెల్లూరు ట్రాన్స్‌ఫర్ అయి నేను నెల్లూరులో ప్రాక్టీసు పెట్టి సంవత్సరం రోజులయినా నాకి భాషాభావం బోధపడడం కష్టంగానే వుంది. మొత్తానికి ఆమెకున్న బాధ తగ్గి, మరలా మొదలయిందనేది నా కర్థమయింది.

"మీరొచ్చింది మొన్ననే కదా! పూర్తిగా మందులు వాడండి తగ్గిపోతుంది" ఉదారంగా ధైర్యం చెప్పాను.

"భలేదాన్నివే" నవ్విందామె మనోహరంగా. "మొన్నంటే మొన్నా నేనొచ్చి నెలకావస్తోంది. పట్టుమని మూడురోజులు మందులు వాడానో లేదో తుదముట్టా తగ్గిపోయెనే అని మందులు ఆపేసానా?" మళ్ళా వచ్చి కూర్చుంది.

ఆమె భాషలోనే కాదు ఆమె భావ ప్రకటనలో కొంత హాస్య ధోరణి వుంది.

"ఓ.పి. కార్డు ఇలా ఇవ్వమ్మా" మెత్తగా అడిగాను. జూనియర్ డాక్టర్ని కదా ఓపిక నా రక్తంలో ఇంకా ప్రవహిస్తోంది.

"ఓ.పి. చీటీయా ఆదేదపోయింతో ఇదో కొత్త చీటి". కాస్త సిగ్గు పడుతూ కాస్త గిల్టీగా ఫీల్ అవుతూ అంది.

పోనీ అప్పుడు ఏ బాధకొచ్చావో చెప్పు.

అప్పుడా? అప్పుడూ నాకు పొట్టలో నొప్పిగా వుంటే ఒంటేల్లో చీమో ఏదో వుందని చెప్పేవు నువ్వు. అప్పుడే మర్చిపోయావా?

నవ్వొచ్చింది నాకు. అన్నీ గుర్తులేవు కాస్త చెప్పు.

ఇంకా ఒళ్ళునొప్పులు, నడుంనొప్పి అయన్నీ ఇప్పుడు లేవులే కడుపులో నొప్పంతే.

అన్ని మందులు వాడావా, మరి?

ఏడా? చెప్పాను కదా. మూడురోజులు వాడేసరికి బాదంతా చేత్తో

తుడిచి పెట్టినట్టు పోయినే. మేమంతా అనుకున్నాంకూడా నీ చెయ్యి చలవచెయ్యని.

వేడి చేతులు, చలవ చేతులని, ఎనాటమీలో, ఫిజియాలజీలో, పేథాలజీలో మేము చదవలేదు. నీరుడు....అదే ఒంటేలులో చీము తగ్గాలంటే కొద్దిరోజులు మందులు వాడాలి. మందులు అయిపోగానే జబ్బు నయం అయిపోయిందని ఆపేయకూడదు. మరలా నా దగ్గరకొచ్చి నేను ఆపేయమనేదాకా ఆపొద్దు.

అర్థం అయిందన్నట్టుగా తలూపి వెళ్ళిందామె.

నెక్స్ట్ పేషెంటొచ్చింది. ఈమె ఒ.పి. కార్డుతో వచ్చింది.

డాక్టరమ్మా! మీరు వ్రాసిచ్చిన మందులు వాడాక జబ్బు మరీ ఎక్కువయింది.

ఆమె జబ్బు పోలీమెనోరియా-ఋతుక్రమం నెలకు రెండుమూడు మార్లు రావడం అన్నమాట.

దానికి వాడిన హార్మోన్స్ దినక్రమం తప్పకుండా వాడితేనే పేషెంటుకి రిలీఫ్ వుంటుంది. ఆ విషయం హార్మోన్ ప్రిస్క్రిప్షన్ చేసేప్పుడు చెపుతాము. అదే అన్నాను ఆమెతో నేను.

మీరేమో చెప్పారు కానీ తగ్గిపోయింది కదా ఇక దేనికిలే అని తగ్గంగానే ఆపేసి దాన్ని ఆపేసేక మళ్ళా మొదలయ్యేవి.

దాని లక్షణమే అంతమ్మా. నాలుగు మాత్రలు వాడి ఆపితే ఐదవరోజు అవుతుంది. పదిమాత్రలు వాడి ఆపితే పదకొండవరోజు అవుతుంది. పూర్తిగా వాడి ఆపితే నెలరోజులకొస్తుంది.

అట్టానా? అయితే పూర్తిగా వాడే వస్తా అని వెళ్ళిందామె. తమాషా ఏమంటే ఆ రోజంతా మందులమీద దాడిచేసిన పేషెంట్లే.

"ఇలేదానివే డాక్టరమ్మా! అట్టాంటి మందా రాసిచ్చేది? నువ్వు ఖచ్చితంగా వాడాలి అని చెప్పావా? మొత్తం వాడేసానా? చూడు నా పెదాలెలా అయిపోయాయో?"

పాపం ఆ పేషెంటుకు సల్ఫా పడలేదు. సల్ఫా కల్సిన మాత్రలు నేను పది వ్రాసిచ్చి ఐదురోజులకు రమ్మన్నాను. చాలా కరెక్ట్‌గా మందులు వాడే పేషెంటులా వుంది. పాపం సల్ఫా పడక పెదాలు నల్లగా అయిపోతున్నా సౌందర్యం సంగతి ప్రక్కకుపెట్టి ఆరోగ్యం సంగతి చూసుకొనే ఆ పేషెంటు తన బాధను నా ముందుంచింది.

చూడు రాజ్యలక్ష్మి! ఏ మందయినా మనకి పడలేదని తెల్సిన మరుక్షణం ఆ మందు వాడడం ఆపి డాక్టర్‌కి చెప్పాలమ్మా.

నాకేం తెలుసు ఆ మందట్టాటిదనుకున్నా?

అల్సర్‌కి మందులు ఆరునెలలు వాడమన్నానని చెప్పాను కదమ్మా అప్పుడే ఎందుకు ఆపేసావ్?

మా పక్కింటోళ్ళు అన్నిరోజులు మందులు వాడితే ఒళ్ళు పాడై పోతుందని చెప్పారు అందుకనీ....

ఒళ్ళు పాడయ్యేదయితే నేనెందుకు వ్రాసిస్తాను. కొన్ని జబ్బులను చాలాకాలం మందులు వాడాలి. గ్యాస్ట్రిక్ అల్సర్‌కు కనీసం ఆరు నెలలు వాడాలి లేకపోతే మరలా వస్తుంది. మిగిలింది వాడేసి వస్తే ఎక్స్‌రే తీయిస్తాను.

ఏం కాదు కదా! వాడమంటావు కదా! వాడ్తాను. నా వైపు అనుమానంగా చూస్తూ సందేహంగా వెళ్ళిందామె.

ప్రక్కింటివాళ్ళ మాటలు చాలా గాఢంగా నమ్ముతారు పేషెంట్లు. ఓ ప్రయివేట్ డాక్టర్ పైకి రావాలంటే పేషెంటుని కాదు ప్రక్కింటి వాళ్ళని ఎడ్యుకేట్ చేయాల్సినట్టుంది.

కొన్ని మందులుంటాయి. ఉదాహరణకు టి.బి. తగ్గించే మందులు. అవి చాలాకాలం వాడాలి. వేడిచేస్తున్నాయని చాలామంది పేషెంట్లు సగంలో ఆపేస్తుంటారు. నిజమే 'అల్సర్ మందులులాగ కాదు, టి.బి.కి వాడే మందులు శరీరంలో కొంత తేడాని చూపిస్తాయి. కాస్త వాంతొచ్చినట్లుండడం- తల తిరిగినట్లుండడం లాంటిది.

కొంతమంది పేషెంట్లకు కాస్త హెచ్చుపాళ్ళలో వుంటుందా లేడా. కొందరికి తెలిసీ తెలియనట్లుంటుంది మార్పు-ఆ మందుల లక్షణమే అంత. ఓర్చుకుని వాడాలి. అంతేకానీ మందులు చౌరుపుచేస్తాయి. కొందరు యాంటిబయాటిక్స్‌ని బతాసీల్లా వాడతారు. జలుబు చేసిందను కోండి ఓ మాత్ర. దగ్గుకి రెండుపూటలు చాలు. జ్వరం వస్తే ఓ నాలుగు పూటలు అంతే.

అలా వాడినందువల్ల ఆ ప్రత్యేకమైన మందు అవసరమైన ఓ ప్రత్యేకమైన జబ్బుకు పనిచేయకుండా పోతుంది. దాన్ని రెసిస్టెన్స్ డెవలప్ చేయడమంటారు.

కొందరికి కొన్ని మందులంటే చాలా ప్రీతి. ముఖ్యంగా ఆస్మా పేషెంట్స్ కార్టిజోన్స్ వాడతారు. ఆయాసం వచ్చినప్పుడల్లా ఓ మాత్ర వేసుకుంటారు. వెంటనే తగ్గిపోతుంది. కానీ చాలాకాలం అలా చేసినందు వల్ల శరీరానికి వ్యాధి నిరోదక శక్తి తగ్గిపోతుంది. ముందు ముందు ఏ జబ్బుకీ త్వరగా కోలుకోలేరు. ఏ ఆపరేషన్‌కి తట్టుకోలేరు. ఏ గాయం అయినా త్వరగా మానదు.

అలా అని కార్టిజోన్స్ (Cortisones) చెరుపుచేసే మందుకాదు అది ప్రాణం కాపాడే మందు. మన ప్రాణం కాపాడుకోవడానికి దానిని మనం భద్రంగా వుంచుకోవాలి.

నా ఆలోచనల్ని తట్టిలేపుతూ అతను "మీరీ మందు వ్రాసిచ్చారు వూరంతా తిరిగినా దొరకలేదు" ప్రిస్క్రిప్షన్ వైపు చూసాను.

"ఐరిన్ క్యాప్సుల్స్" ఒక్కసారి మార్కెట్‌లో అవుటాఫ్ స్టాక్ అవుతాయి కొన్ని కొన్ని మందులు. ఇవి రక్తంపట్టే క్యాప్సూల్స్. షాపువాళ్ళు మరో కంపెనీవి ఇస్తే పోయ్యేది పాపం శ్రమపడ్డారు. అతను క్షణం ఆగాడు. ఇచ్చారు నేనే ఒప్పుకోలేదు. మీరు వ్రాసింది ఒకటైతే వాళ్ళింకోకటిస్తే మా ఆవిడ జబ్బుతగ్గవద్దా! అతను తెలివయినవాడు. అందరు పేషెంట్లు అలా వుంటే మాకింత శ్రమకూడా వుండదు. కానీ

ఈ రోజుల్లో ప్రతి కంపెనీ మందు ప్రతి షాపువాళ్ళు పెట్టాలంటే కొద్దిగా కంపెనీ మార్పుతో ఇచ్చే మందులు షేమంగీకరించాలి. కానీ కంపెనీ మార్చకుండా మందే మారిస్తే? అలా చాలా మంది చేయరు. చేస్తే అది కొత్తగా పనిలో చేరిన లూయిస్ చేసే పనయ్యుంటుంది. అలా జరక్కుండా మెడికల్ షాప్స్ వాళ్ళు చూస్తారని అతనికి హామీ ఇచ్చి పంపాక మరో పేషెంటు....

థియేటర్‌లో కెళ్ళి డి.యం.సి. కేస్ ఒకటుంది అటెండయి వచ్చాను. దాడి మరలా ప్రారంభమయింది.

"ఏం మందులో! ఏం పాడో ఇల్లుగుల్లయిపోతోంది. ఇంకా ఎన్ని రోజులు వాడాలి డాక్టరమ్మా."

ఓ.పి. కార్డు వైపు చూసాను. ప్రిస్క్రిషన్‌లోకి చూపు సారించాను.

ఆమెకు టైఫాయిడ్ జ్వరం. టైఫాయిడ్ జ్వరానికి ఇదివరకు రోజుల్లో క్లోరోమైసిటిన్ క్యాప్సూల్స్ వాడేవాళ్ళం. వాటివల్ల రక్తకణాల్లో కొంత మార్పు రావడానికి కొంత అవకాశం వుంది. కనుక జాగ్రత్తగా బ్లడ్ టెస్ట్ చేసుకుంటూ వాడేవాళ్ళం. ఇప్పుడు చాలా రకాలొచ్చాయి. **Ciprofloxadin,** లాంటివి కానీ మా పేషెంటు కోట్ చేసినట్లు చాలా ఖరీదు అది.

సామాన్య పేషెంటుకు అందుబాటులో లేదది. ఒక మంచిమందు మార్కెట్‌లో కొస్తే అది మధ్య తరగతి పేషెంటుకి కూడా ఉపయోగపడేదిలా వుంటే బాగుంటుంది.

"తక్కువ ఖరీదులో వ్రాసివ్వనా?" వద్దులేండి మరలా అయ్యేం చేస్తాయో నిట్టూర్చి, అ ఏది ఘటుకు ధరలు పెరగలేదు. బతికేట్టున్నాయా రోజులు. అని జత చేసి తృప్తి పడింది పాపం.

"డాక్టరమ్మా? మా ఆయన తిడుతున్నాడు ఎన్నిరోజుల నుండి పోతానే వుండావు. ఏదీ గుణం కన్పిస్తే కదా!" అని అంది.

"అసలు ఎవర్ని తిడుతున్నాడు నిన్నా....నన్నా?" అని నవ్వుతూ అడిగాను.

ఆమె సర్దుకుంది.

అబ్బే మిమ్మల్ని కాదు నన్నే.

"నిన్నెందుకు తిడ్తాడు. నీకేమైనా సర్దానా మందులు తినడానికి?" అన్నాను నవ్వుతూనే.

ఆమె మాట్లాడలేదు.

ఆమె దగ్గర సమాధానం సిద్ధంగా లేదు. ఎందుకంటే వాళ్ళాయన తిట్టలేదు.

ఆమే మనస్సులో భావాన్ని మరోలా వ్యక్తం చెయ్యలేక అతని మీద పెట్టిందంతే—

ఇంతకీ ఆమెకు పిల్లలు లేరు. ఆమెలో విత్తనం లేదు. అదీ దోషం.

ఆరు నెలలుగా మందులు వాడుతోంది, స్కానింగ్ తీస్తుంటే ఆ విత్తనం విడుదల కావడం లేదనే వస్తోంది. ఫాలికల్ రప్చరం అయి విత్తనం విడుదలయి ఆమెకు గర్భం రావడానికి వాడే మందులు ఖరీదైనవి.

ఇంకా కాలేదని తల్లి గుండెల్లో ఆశ అల్లరి పెడుతుందే, దాన్ని అందుకోవాలని ఆరాటపడుతుందే ఆ ఇంటి యజమాని జేబు అందుకు అంగీకరించడం లేదు. దాని పర్యావసానమే ఈ ఆవేదన.

అప్పుడు టైమ్ మూడు.

"గంట మూడయింది లంచ్ టైమ్ రండి" అని సిస్టర్ పిలిచింది.

"ఇంకెంత మందున్నారు?"

"ఇద్దరు."

"ఇద్దరేనా వాళ్ళని పంపించండి తర్వాత మీల్స్‌కొస్తాను."

"మీల్స్‌కు అన్నీ రెడీ చేస్తానమ్మా రండి తర్వాత చూద్దురు" అంది మరలా నర్స్.

నిజమే నాకు మరలా ఓపిక కావాలి కదా యుద్ధం చేయడానికి అందుకే కుర్చీలో నుండి లేచాను.

* * * *

"పో డాక్టరమ్మా నాకు నయం కాలేదు." నాకు చాలా విచిత్రంగా వుంటుంది. మా డిస్ట్రిక్టులో ఎలాటి వాళ్ళయినా మీరు అని బహువచనం తోనే సంభోధిస్తారు. అలాంటిది తెలిసిన వాళ్ళని, తెలియని వాళ్ళని తమ కంటే పెద్దవాళ్ళని కూడా ఇక్కడ నువ్వు అంటారు మొదట్లో చిరాగ్గా వున్నా రాను రాను వాళ్ళ పిలుపులో దగ్గరతనం ఆప్యాయత నన్ను మార్చేసింది.

"పో డాక్టరమ్మా! నాకు నయం కాలేదు" అన్న ఆ పేషెంటు మెంటల్ డిప్రెషన్ పేషెంటు మానసిక వ్యాధికి మందులొచ్చిన అందమయిన రోజులివి కానీ కనీసం మూడు నెలలు మందులు (Trangulisors) వాడందే అసలు జబ్బు తగ్గు ముఖం పట్టదు. నేను మూడు నెలలకు సరిపడా మందులు వ్రాసిచ్చినా ఆమె వారానికే తిరిగొచ్చింది. ఆమె ననడానికి కూడా లేదు. ఆ జబ్బు అలాంటిది మనిషిని స్థిరంగా ఒక చోట నిలవనీదు, స్థిమితంగా ఆలోచించ నివ్వదు. గిలి నిముషాల మీద నయమై మామూలు మనిషయిపోవాలని ఆరాటం. నీకు తగ్గిపోతుందమ్మా కనీసం మూడు నెలలు పడుతుందమ్మా ఈ మూడు నెలలు కాలం నీది కాదని కళ్ళు మూసుకో నువ్వు చాలా మామూలు మనిషైపోతావు.

మనస్సు ప్రశాంతంగా వుంటుంది. భయం, దిగులు నా కొకప్పుడు

వుండిందా అని నువ్వే ఆశ్చర్యపోయేంత మారిపోతావు. నా మాట విని అప్పుడే తగ్గలేదనుకోకుండా నా మీద నా మందుల మీద నమ్మక ముంచు. నీకు నేను నయం చేస్తాను. మానసిక వ్యాధికి మందుకంటే బాగా పనిచేసేది డాక్టర్ మాట ధైర్యం, ఓదార్పు.

మూడు నెలలు తర్వాత ఇక మందులు వాడబల్లేదు కదా. మరలా రాదు కదా!

మరలా రాదు అనేది గ్యారంటీ లేదు. ఇలాంటి పేషెంట్స్ మనస్సు సున్నితం ఎప్పుడైనా జీవితంలో మరో ఎదురు దెబ్బ తగిలి నప్పుడో లేక కొంత కాలం అయ్యాకో మరలా అ వ్యాధిరావడం జరుగు తుంధి.

అప్పుడు మరో కోర్సు మందులు వాడాల్సి వుంటుంది. కానీ ఆ విషయం పేషెంట్‌కి చెప్పకూడదు. వాళ్ళలో నిరాశనిరుత్సాహం కల్గించ కూడదు.

మనిషి ఓ మిషన్ ఆ మిషన్‌లాటి మనిషికి రిపేర్ తప్పదు. ఇప్పుడు రిపేరు చేసి ఏం లాభం మరలా రిపేర్‌కి రాదా అంటే మనిషి బాగైన ఆ కొంత కాలమైనా మానసికంగా, ఆనందంగా వుండడమే కదా కావాలి అందుకే అబద్ధం చెప్పాను.

“ఇక రాదు కానీ మూడు నెలలకే ఒకేసారి అన్ని మందులు ఆప కూడదు. క్రమేపీ తగ్గిస్తూ రావాలి.”

“అట్టే మీరెట్టా చెపితే అట్టే చేస్తాను. నన్ను ఈ నరకాన్నుండి తప్పించండి. ఒంటికి ఏదొచ్చినా పర్వాలేదు. ఈ పాడు జబ్బు మాత్రం నన్నొదిలితే అంతే చాలు.”

భుజం మీద చెయ్యి వేసి అన్నాను.

"తగ్గిపోతుంది. మందులు మీద నమ్మకముంచు" ఆమె తృప్తిగా వెళ్ళింది.

ఇది వరకు రోజుల్లో విజ్ఞానం విస్తృతంకాకముందు ఈ జబ్బులే గాలి, ధూళి అనే వాళ్ళు.

మన మనస్సే మనకు శత్రువై కవులు సృష్టించిన నరకం మన శరీరంలోనే ప్రత్యక్షమయితే దాన్ని తరమడానికి మందులున్నయంది– వాటిని కొన్ని నెలలు వాడితే మనం ఆ భయం దిగులు అనే దురదృష్ట పూరిత మయిన విషాద ప్రపంచం నుండి బయట పడతామని తెలిసి అలా వాడకపోవడం మన అమాయకత్వం కాదూ!

❋